# చుండూరు మారణకాండ – ప్రభుత్వం వైఖరి
# రాష్ట్ర ప్రజానీకానికి పౌరహక్కుల సంఘం వినతిపత్రం

గౌ॥ రాష్ట్ర ప్రజలకు
ఆంధ్రప్రదేశ్

విషయము : చుండూరు మారణకాండ సదరు ఎస్.ఐ, సి.ఐలను అరెస్టు చేయకపోవుట-ముఖ్యనిందితులను అరెస్టు చేయుటలో వైఫల్యము నొందుట దాడికి బాధ్యులయిన వారిఅరెస్టులు జప్తుచేయకుండుట-స్పెషల్ కోర్టుల ఏర్పాటు పట్ల మిక్కిలి అనాసక్తి-గుంటూరు జిల్లాలో నిరంతర నిషేధాజ్ఞలు-అనీల్ కుమార్ హత్య-ఎస్.పిమీనాపై చర్యగైకొనక పోవుట ఇత్యాది...

అయ్యా / అమ్మా,

ప్రభుత్వమునకు తన విధులు గుర్తుచేస్తూ మెమోరాండంలు అనగా వినతిపత్రములు సమర్పించి సమర్పించి విసిగి యున్నాము. దొంగల ముఠా నాయకునకు 'అయ్యా! ఇవిగో ఇన్ని దొంగతనములు మీ ముఠావలన జరిగినవి. ఇవి చట్టమునకు విరుద్ధమయినవి, దయయుంచి ఏదియేని చర్య గైకొనుడు' అని విజ్ఞాపన పత్రములు సమర్పించుట ఎంత నిరర్ధకమో ఇదియును అంతేనని గ్రహించి యున్నాము. కావున ఈ ప్రభుత్వమునకు కాక, దానికి వోట్లు వేసి ఎన్నుకొని తదుపరి పన్నులు గట్టి సారాయి త్రాగి దానిని పోషించుచున్న మీకు అనగా ప్రజలకు విజ్ఞాపన పత్రము సమర్పించుకుందామని నిర్ణయించుకున్నాము. అంతేగాక కృత్రిమమైన ఈ తాసీల్దారు భాషలో కాక మీ భాషలోనే వ్రాయవలెనని నిర్ణయించుకొన్నాము. ఈ మా విన్నపమును ఆలకించుడు.

ప్రజలారా!

చుండూరు హత్యాకాండ జరిగి రెండున్నరనెలలు గడిచాయి. రోజూ క్రమం తప్పకుండా దినపత్రికలలో చుండూరు గురించి ఏదో వార్త ఉంటూనే ఉంది. ప్రభుత్వం బాధితులకు ఏమీ చేయడం లేదని ఒకవైపు, అంతా చేయడానికి సిద్ధంగా ఉన్నా కొందరు స్వప్రయోజనపరులు అడ్డం తగులుతున్నారని రెండవవైపు వార్తలొస్తున్నాయి. దాడి జరుగుతున్నప్పుడు గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయిన ఎస్.ఐ., సి.ఐలమీద చర్యతీసుకోవాలని ఒకవైపు, విచారణ అయిపోగానే తప్పక తీసుకుంటాం ఇంకా ఆందోళన ఎందుకని రెండవైపు ప్రకటనలు వస్తున్నాయి. స్పెషల్ కోర్టులు నెలకొల్పాలని ఒకవైపు, మూడు స్పెషల్ కోర్టులు పెడుతున్నాం గదా ఇంకా గొడవెందుకని రెండవవైపు అంటున్నారు.దాడి చేసినవారివి, వారికి రక్షణ ఇస్తున్న వారివి, ఆస్తులు జప్తుచేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ఏమయిందని ఒకవైపు, హామీ అమలుకు ఏవో చట్టపరమయిన ఆటంకాలున్నాయని ఇంకొకవైపు చెప్తున్నారు. అనీల్ కుమార్‌ను ఉద్దేశ్యపూర్వకంగా హత్య చేసారని ఒకవైపు, కాదు దళితులు పోలీసులను భరించరాని బాధలు పెడితేనే పోలీసులు కాల్పులు జరిపారని రెండవైపు ఆరోపణ ప్రత్యారోపణలు చేస్తున్నారు.

వీళ్లొకటి వాళ్లొకటి అంటూవుంటే 'మాకంతా అయోమయంగా ఉంది' అనుకోవడం తప్పు. నిజానిజాలు తెలుసుకోవలసిన బాధ్యత పౌరులుగా మన మీద ఉంది. దానికి ప్రాతిపదిక ఏదంటారా? చూడడానికి కళ్ళు వినడానికి చెవులు ఉన్నాయి. వ్యాఖ్యానించడానికి మౌలిక ప్రజాస్వామిక విలువల ప్రాతిపదిక ఉంది. ప్రజలహక్కులనూ ప్రభుత్వ బాధ్యతలనూ నిర్దేశించే రాజ్యాంగ శాసనాలున్నాయి. అనేక ఆందోళనల ఫలితంగా ప్రజలు సాధించుకున్న కొన్ని చట్టాలున్నాయి.

## 1. ఎస్.ఐ., సి.ఐ.-డి.ఎస్.పిల అరెస్టు

ఆగస్టు 6న దాడి జరిగిన సమయంలో చుండూరులో పెద్ద ఎత్తున మోహరించి ఉన్న పోలీసులు దాడిని నిరోధించడానికి గానీ దళితులను కాపాడడానికి గానీ ఏమీ చేయలేదు. పైగా దాడి మొదలు కాకముందు దళిత యువకులను చెదరగొట్టి దాడికి పరోక్షంగా సహకరించారు. దాడి తమ కళ్ల ముందు జరుగుతూఉంటే కనీసం ఆ సమాచారం జిల్లా కేంద్రానికి చేరవేయలేదు. ఇది ప్రభుత్వంతో సహా అందరూ ఒప్పుకొంటూ ఉన్న వాస్తవం.

దీనిని 'విధి నిర్వహణలో వైఫల్యం' అని ప్రభుత్వం అంటుంది. శాఖాపరంగా విచారణ జరిపి శాఖాపరంగా చర్య తీసుకుంటాం (అంటే ఇంక్రిమెంట్లు కోత, రివర్షన్ మొదలయిన చర్యలు తీసుకుంటాం) అని అంటుంది.

ఇది విధి నిర్వహణలో వైఫల్యం మాత్రమేకాదు, ఇదినేరం అని ఆందోళన కారులు అంటున్నారు. నేరానికి జరగవలసింది శాఖాపరమయిన విచారణకాదు, కోర్టులో కేసంటున్నారు. దానికి శిక్ష రివర్షన్ కాదు. జీవిత ఖైదంటున్నారు.

ఇందులో ఎవరిది న్యాయం? చట్టం ఏమంటుంది? హత్యాకాండ తన కళ్లముందు గంటల తరబడి జరుగుతూ ఉంటే చూస్తూ నిలబడ్డ పోలీస్ అధికారి కేవలం విధినిర్వహణలో విఫలం అయినట్టా? నేరానికి తోడ్పడ్డట్టుకాదా? భారత శిక్షాస్మృతిలో నేరానికి తోడ్పాటు ఆ నేరంతో సమానమయినది కాదా? మరి దోషులయిన పోలీసులను ఎందుకు అరెస్టు చేయరు?

ఈ ప్రశ్నల దాకా కూడ మనం పోనవసరం లేదు. వీటిలో మొదటిది చాలా సున్నితమయిన ప్రశ్న అని నిపుణులు అంటారేమో. అయితే దళితులపైన దాడులకు సంబంధించి వేరే ప్రత్యేక చట్టం ఉంది. అందులో ఎటువంటి చర్చకు ఆస్కారం లేకుండా అంతా స్పష్టంగానే రాసిఉంది.

**ఈ చట్టం ఎస్‌సి మరియు ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం. ఇది 1989లో జారీ అయింది. ఇందులో**

**సెక్షన్ 4:** *ఒక ప్రభుత్వ ఉద్యోగి (షెడ్యూల్డు కులానికీ లేక తెగకూ చెందిన వ్యక్తి కానివక్షంలో) ఈ చట్టం కింద తాను నిర్వహించవలసిన బాధ్యతలను తెలిసీ నిర్లక్ష్యం చేస్తే అది నేరం. దానికి శిక్ష 6నెలల నుండి 1 సంవత్సరం ఖైదు.*

**సెక్షన్ 3(2) (VI):** *ఒక వ్యక్తి ఈ చట్టం క్రింద నేరం జరిగిందని ఎరిగివుండి, లేక ఆ విధంగా నమ్మడానికి కావలసిన ఆధారాలు కలిగివుండి, దానికి సంబంధించిన సాక్ష్యాలను మాయం చేసినా... లేక తెలిసి తప్పుడు సమాచారం ఇచ్చినా అదినేరం . అసలు నేరానికి ఎంత శిక్షో దీనికీ అంతే శిక్ష.*

పై రెండు నేరాలూ ఆనాడు చుండూరులో డ్యూటీలో ఉన్న పోలీసులు చేసారుకదా? తెనాలి డి.ఎస్.పి వీటిలో రెండవనేరానికి పాల్పడ్డాడు కదా? అది షెడ్యూల్డు కులానికి చెందిన వ్యక్తికీ కూడ వర్తిస్తుంది కదా? మరి అటువంటప్పుడు చట్టపరంగా పై అధికార్లందరినీ అరెస్టు చేసి కోర్టులో పెట్టి విచారించి శిక్షించవలసిందేగదా? దీనికి వివాదం ఎందుకు? చర్చలెందుకు? చట్టపరమయిన ప్రభుత్వ బాధ్యత చర్చనీయాంశం ఎట్లా అవుతుంది?

## 2. ఆస్తుల జప్తు :

చుండూరు హంతకుల ఆస్తులను వారికి సంరక్షణ కల్పిస్తున్నవారి ఆస్తులనూ జప్తు చేస్తామని ముఖ్యమంత్రి మొదట్లో ఆర్భాటంగా హామీయిచ్చాడు. ఆ తరువాత ఆ సంగతి మాట్లాడడం మానేసాడు. ఆందోళన కారులు ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండు చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకిచ్చే హామీలకేమీ విలువలేదా? వాటిని అమలు చేయించుకునే హక్కు ప్రజలకు లేదా? పండితులు ఇది చర్చించవలసిన విషయం అంటారేమో. అంతదూరం పోవద్దులెండి. ఆస్తుల జప్తు గురించి చట్టం ఏమంటుంది?

అంటరాని తనానికి సంబంధించిన నేరాలను అరికట్టడానికి మన దేశంలో 1955 నుండి ఒక చట్టం ఉంది. దానిపేరు పౌరసత్వ హక్కుల పరిరక్షణ చట్టం (పిసిఆర్ ఆక్ట్). అందులో

**సెక్షన్ 10 A:** *ఒక ప్రాంతములోని వ్యక్తులు ఈ చట్టం క్రింద ఒక నేరానికి పాల్పడినట్టు, లేక పాల్పడిన వారికి తోడ్పాటు ఇచ్చినట్టు, లేక నేరానికి పాల్పడినవారికి రక్షణ కల్పించినట్టు, లేక నేరస్తులను పట్టుకొనడానికి సహాయ సహకారాలు అందియ్యకున్నట్టు, లేక నేరానికి సంబంధించిన సాక్ష్యాలను కప్పి పెడుతున్నట్టు, ప్రభుత్వానికి విశ్వసనీయంగా తెలిస్తే వారందరిమీద ఉమ్మడిగా జర్మానా విధించవచ్చును.*

జర్మానాచెల్లించకపోతే వారిఆస్తులను జప్తుచేసుకొని ఆమేరకు వేలంవేసి వసూలు చేసుకొనవచ్చునని సెక్షన్ 10A(5) అంటుంది. ఈసెక్షన్లుఎస్.సిమరియుఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టానికి తు.చ.తప్పకుండవర్తిస్తాయని ఈచట్టంలోని సెక్షన్ 16 అంటుంది.

పై నేరాలకు చుండూరుకు చెందిన అగ్రకులస్తులు పాల్పడడం లేదా? ఒక్క చుండూరే కాదు, గుంటూరు జిల్లాలోని అనేక గ్రామాల అగ్రకులస్తులు చుండూరు హంతకులకు సహాయ సహకారాలు అందియ్యడం లేదా? గుంటూరు జిల్లాయే కాదు, కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ మొదలుకొని అనేక జిల్లాలలో అనేక గ్రామాల అగ్రకులస్తులు పైనేరాలకు పాల్పడడం లేదా? ఇది అందరికీ తెలిసిన సంగతే కాదా? పత్రికలలో వార్తలు రావడం లేదా?

మరి చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వానికి మొగమాటం ఎందుకు? అందులో వాదోపవాదాలకూ చర్చలకూ తావేముంది?

## 3. స్పెషల్‌కోర్టులు :

చుండూరు మారణకాండ జరిగినప్పటినుండి స్పెషల్‌కోర్టుల ప్రస్తావన గందరగోళంగా వస్తూనే ఉంది. చుండూరు కేసు విచారించడానికి స్పెషల్‌కోర్టు నెలకొల్పడానికి ప్రభుత్వం ఒప్పుకుంది త్వరలోనే నెలకొల్పుతుందేమోకూడ. ఆకోర్టు చుండూరులో ఉండాలా లేక తెనాలిలోనా అనేది బాధితుల సౌకర్యాన్ని బట్టి నిర్ణయించడం సబబు.

కానీ స్పెషల్‌కోర్టుల వివాదం అక్కడితో ఆగిపోలేదు. చుండూరు కేసుకోసం ఒక స్పెషల్ కోర్టునికాక, దళితులపైన జరిగే దాడులను విచారించడం కోసం శాశ్వతంగా జిల్లాకొక స్పెషల్ కోర్టు నెలకొల్పాలని ఆందోళనకారులు కోరుతున్నారు. ఇది కూడ చట్టపరంగా ప్రభుత్వబాధ్యతే. ఎస్‌సి. మరియు ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

సెక్షన్ 14: *ఈ చట్టం క్రింద విచారణ వేగంగా ముగించడం కోసం ప్రభుత్వం ప్రతీ జిల్లాలోనూ ఈ కేసులు విచారించడం కోసం ఒక స్పెషల్ కోర్టును నెలకొల్పాలి.*

ఈ చట్టం జారీ అయి రెండేళ్లయింది. ప్రతీజిల్లాలోని అదనపు సెషన్స్ కోర్టునొక దానిని ఈ చట్టానికి సంబంధించిన స్పెషల్ కోర్టుగా మొదట్లో ప్రకటించారు. అయితే దానివలన ఈ కేసుల విచారణ సత్వరంగా జరగాలన్న లక్ష్యం నెరవేరదు. పూర్తిగా ప్రత్యేకమయిన కోర్టు ఉండాలి. లేకపోతే మిగిలిన కేసులతో బాటు ఇవికూడ సావధానంగా కుంటినడక నడుస్తూ ఉంటాయి. ఆరేళ్లయినా ఇంకా విచారణ ప్రారంభంకాని కారంచేడు కేసుగతి చూస్తున్నాము కదా!

అయితే అక్కడితో ఆగకుండా ముఖ్యమంత్రి గారిప్పుడు దళితులపైన దాడులు నివారించడానికి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో మూడు స్పెషల్ కోర్టులు నెలకొల్పుతానని ప్రకటించారు. ప్రతీజిల్లాలో ఒకటి నెలకొల్పాలని చట్టం అంటూ వుంటే మూడు ప్రాంతాలకు మూడు అనడంలో అర్థం ఏమిటి? తెలంగాణాకు స్పెషల్ కోర్టు మహబూబ్ నగర్ లో పెడతారంట. అంటే ఆదిలాబాద్ లో గిరిజనులపైన దాడులు జరిగితే వాళ్లు సాక్ష్యం ఇవ్వడానికి మహబూబ్ నగర్ చుట్టూ తిరగాలన్నమాట! ఇది ఎవరికి శిక్ష, దాడి చేసిన వారికా లేక దాడికి గురయిన వారికా?

## 4. బాధితుల పునరావాసం :

పైవన్నీ చట్టం ప్రకారం తాను చేయవలసినవేనని ఒప్పుకొన్నా పునరావాసం మట్టుకు తన దయాదాక్షిణ్యాల ఫలమేనని ప్రభుత్వం అంటుందేమో. ఒక ఎకరం ఇచ్చేదీ అర్థ ఉద్యోగం ఇచ్చేదీ తన మెహర్బానీ అనుకుంటుందేమో అది నిజంకాదు. పునరావాసం కూడ ఎస్.సి. మరియు ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం క్రింద బాధితుల హక్కే.

సెక్షన్ 21 (1) : *ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంకోసం అవసరమయిన అన్ని చర్యలూ చేపట్టాలి.*

(2) *(iii) అందులో భాగంగా, ప్రత్యేకించి, బాధితులకు ఆర్థికంగా సామాజికంగా పునరావాసం కల్పించేచర్యలు చేపట్టవచ్చును.*

చేపట్టవచ్చును' అంటే చేపట్టకుండా పోవచ్చును కూడ అని అర్థం చేసుకోకూడదు. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంకోసం ఏది అవసరమో అది తప్పనిసరిగా చేయవలసిందే. పునరావాసం అందుకు అవసరం అని వేరే చెప్పనవసరం లేదు.

పునరావాసం అంటే గుంటూరులోనో, తెనాలిలోనో భిక్షగాళ్లగా బ్రతకమని తెచ్చి వదిలేయడం కాదు. వాళ్లు మళ్లీ దాడులకు గురయ్యే దుస్థితి ఏర్పడకుండా స్వతంత్రంగా గౌరవంగా బ్రతికే పరిస్థితి కల్పించాలి. చట్టమే ఇంత చెప్పిన తరువాత ఇంక వాదోపవాదాలు దేనికి? శుష్క ప్రకటనలు దేనికి? స్వతంత్రంగా గౌరవంగా బ్రతకడానికి ఏమాత్రం భూమి కావాలో ఏపాటి జీవన వసతి కల్పించాలో ఎవరికి తెలియదు?

మన పాలకులు 'రూల్ ఆఫ్ లా" (Rule of Law)ను వంకాయల బేరానికి దిగజార్చారు. నాకు న్యాయం చేయమని పోలీస్ స్టేషన్ కుపోతే 'ఎంతిస్తావ్'అంటాడు. ఎంతిస్తే అంతన్యాయం చేస్తాడు. ప్రభుత్వ యంత్రాంగమంతా అట్లాగే తయారయింది. 'ఎంతిస్తావ'ని అడక్కపోవచ్చు. నాకు రాజకీయంగా లొంగిపొమ్మని ప్రభుత్వం చుండూరు బాధితులను అడుగుతూవుంది. లొంగిపోతే ఇంద్రలోకమే మీదంటూఉంది. ఇది రామరాజ్యం అవునోకాదోగానీ ప్రజాస్వామ్యం మట్టుకుకాదు.

## నిషేధాజ్ఞలు, అనీల్ కుమార్ హత్య :

గుంటూరు జిల్లా ఎస్.పి.రఘువీర్ ప్రసాద్ మీనా ప్రజాస్వామ్యంగా భావించే దేశంలో పోలీస్ అధికారిగా ఉండడానికి ఎంత మాత్రం అర్హత లేని వ్యక్తి అనేది పౌరహక్కుల సంఘం నిశ్చిత అభిప్రాయం. అయనొక్కడికే లేదని కాదు. చాలామందికి లేదు. కానీ ఆయనకు మట్టుకు కచ్చితంగా లేదు.

'ఇదిగో ఇప్పుడే చెప్తున్నాను వినకపోతే కాల్చేస్తాను' అని రెండురోజులకొకసారి ఎవరినో ఒకరిని హెచ్చరిస్తూ ప్రకటన లిస్తూంటాడు. ఈయన. ఏ శాసనం, ఏ రాజ్యాంగ అధికారం ఆయనగారికి ఆ రకమయిన ప్రకటనలు చేసే అధికారం ఇచ్చిందో ఆయనకే తెలియాలి. ప్రస్తుతం భారతదేశంలో అమలులో ఉన్న రాజ్యాంగం మట్టుకు ఇవ్వలేదు.

అయితే ఆయనకు ప్రజాస్వామ్యాన్ని గురించి కొన్ని నిర్దిష్టమయిన అభిప్రాయాలున్నాయి. రాజకీయనాయకులకూ పోలీసేతర ప్రభుత్వ అధికార్లకూ ఉన్న అధికారాలన్నీ పోలీసులకే ఇచ్చేయాలి. పోలీసులే దేశాన్ని చక్కగా ఏలగలరు. కోర్టులు ప్రజల హక్కులను కాపాడడం మానేసి పోలీసుల సౌకర్యాన్ని బట్టి తీర్పులివ్వాలి. మేధావులూ విద్యావంతులూ పత్రికారంగమూ అన్నీ అందరూ కూడ తదనుగుణంగా వ్యవహరించాలి. ప్రజలు ఏరకమయిన అలజడులకూ ఆందోళనలకూ పాల్పడకూడదు. కష్టాలుంటే అధికార్లకు చెప్పుకోవాలి. అవి తీరకపోతే మళ్లీ చెప్పుకోవాలి. అంతే.

హిట్లర్ అనే ఆయనకు కూడ ఇట్లాంటి అభిప్రాయాలే ఉండేవి. ఆయన వాటిని అమలు చేయడం కోసం ఒక పార్టీ పెట్టుకొని

రాజకీయ రంగంలో పోటీపడి అధికారానికి వచ్చాడు. తన అభిప్రాయాలను అమలు చేయడానికి లక్షలాది మందిని చంపాడు. చివరికి తానే పతనం అయ్యాడు. మీనాగారు మన దురదృష్టంకొద్దీ ఐపిఎస్‌లో ఉత్తీర్ణులయి, రాజ్యాంగాన్ని అమలుచేసే ఎస్‌పి ఉద్యోగం చేపట్టి ఆ రాజ్యాంగముతో ప్రకటించిన ప్రజాస్వామిక విలువలకూ హక్కులకూ పూర్తిగా విరుద్ధమయిన ఈ అభిప్రాయాలను తుపాకులతో అమలు చేస్తున్నాడు. దాని పర్యవసానం ఎట్లా ఉంటుందో నిజామాబాద్ లో మూడేళ్ళు ఎస్‌పిగా ఉండి రుచి చూపించాడు. 53మందియువకులను 'ఎన్‌కౌంటర్ల'లో కాల్చేసి గ్రామాలను దిగ్బంధనం చేసి దాడులు చేసి వందలాది మందిని 'టాడా' కింద జైలుకు పంపించాడు.

ఇప్పుడు గుంటూరులో ఇంకొంచెం రుచి చూపిస్తున్నాడు. చుండూరు హత్యాకాండకు నిరసనగా ఎవ్వరూ ఎటువంటి ప్రజాతంత్ర ఉద్యమం చేపట్టడానికి వీలులేదు. బంద్‌లు, నిరాహారదీక్షలు, ధర్నాలు, ఊరేగింపులు, బహిరంగసభలు అన్నీ బంద్. కాదంటారా? మీనాగారు కాల్చి పడేస్తారు. దళిత మహాసభ కాదనింది. చుండూరులో నిరసన ప్రారంభించింది మీనాగారి పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగారు. చుండూరు చేరుకొన్నారు. టెంటు పీకేసారు. బాధితులకోసం ఎవరెవరో ఇచ్చిన తిండిగింజలు ధ్వంసం చేసారు. అనిల్‌కుమార్‌ను గురిపెట్టి కాల్చి చంపారు. నిరసనను భగ్నం చేయడమేకాక, పనిలో పనిగా చుండూరు హత్యాకాండకు ఒక ముఖ్యసాక్షిని, ఎదుగుతున్న ఒక దళిత నాయకుడిని, పొట్టన పెట్టుకొన్నారు.

'మేము ఎవ్వరికీ అనుమతి ఇవ్వడంలేదు' అని మీనాగారు జవాబు చెప్తారు. సర్వజనాభ్యుదయ పోరాట సమితికీ ఇవ్వడంలేదు. దళిత మహాసభకూ ఇవ్వడం లేదు. వేరే ఎవ్వరికీ కూడ ఇవ్వడం లేదంటారు. నిజానికి వారు అంత నిష్పాక్షికంగా లేరు. నిషేధాజ్ఞలను అతిక్రమించిన వారందరితో ఒకేరకంగా వ్యవహరించడంలేదు. అగ్రకులాల యువకులు ఎ.సి.కాలేజి మీద దాడి చేసిన రోజు మీనాగారు స్వయంగా అక్కడే ఉండి చాలా 'జాగ్రత్తగా' వ్యవహరించారు. ప్రాణనష్టం కాకుండా కాల్పులు జరిపించారు. దళితుల టెంటు పీకేసిన రోజున మీనాగారి పోలీసులు అంతటి జాగ్రత్త ప్రదర్శించడం అవసరం అనుకోలేదు.

అదిపోనిచ్చి, అసలు ఆ సమాధానం న్యాయమైనదేనా? చట్టంచాలా నిష్పాక్షికమయినది. అది ఎవ్వరినీ అడుక్కోనివ్వదు. భిక్షగాడినీ అడుక్కోనివ్వదు, కోటీశ్వరుడినీ అడుక్కోనివ్వదు, అని ఒక ఆంగ్ల రచయిత వ్యంగ్యంగా అన్నాడు. ఈ రకమయిన నిష్పాక్షికత న్యాయమయినదేనా?

దళిత మహాసభ, దళితులకు మద్దతుగా నిలబడ్డ ఇతర సంస్థలు, ప్రజాతంత్ర ఉద్యమ సంస్థలు, మౌలిక ప్రజాతంత్ర విలువలను ముందుకు తీసుకుపోవడం కోసం ఏర్పడిన సంస్థలు సర్వజనాభ్యుదయ పోరాట సమితి ప్రజాతంత్ర విలువలను నాశనం చేయడం కోసం, ధ్వంసం చేయడంకోసం, ఏర్పడిన సంస్థ, తరతరాల కుల అహంకారాన్నీ అగ్రకుల ఆధిపత్యాన్నీ పటిష్టం చేయడంకోసం పుట్టిన విషకూటమి. దళితులకు ఉద్యమాలు అవసరం. దళిత వ్యతిరేకులకు అవసరం లేదు. ఉద్యమాలు చేపట్టనిదే దళితులు తమ బలహీనతను పోగొట్టుకోలేరు. తమ అనైక్యతనూ వెనుకబాటుతనాన్నీ అధిగమించలేరు. 'సర్వజనులు' అనిపేరుపెట్టుకున్న అగ్రకుల దురహంకారులు ఇప్పటికే బలవంతులు. ఇప్పటికే ఐక్యంగా ఉన్నారు. వాళ్ళకు ఉద్యమాల అవసరం ఏముంది? ఇద్దరి అవసరాలూ ఒకటే ఎట్లా అవుతాయి? 'వాళ్ల సభలకూ అనుమతి లేదు, మీ సభలకూ అనుమతి లేదు' అనడం నిష్పాక్షికత ఎట్లా అవుతుంది? ఇద్దరికీ అనుమతి ఇవ్వమనండి. ఇద్దరినీ పోట్లాడనివ్వండి. ఇద్దరినీ ఉద్యమించనివ్వండి. వాళ్ళకిది అవసరమోకాదోగానీ దళితులకు అవసరం. దళితులపైన దాడులు ఇంతగా జరుగుతున్నాయి. దీనికి పరిష్కారమేమిటి? అని అందరూ వాపోతున్నారు. పరిష్కారం ఒకరు చెప్పేది కాదు. ఒకరు నిలబెట్టి అమలు చేసేది కాదు. దళితులు ఒకటై ఉద్యమించిన నాడే దొరుకుతుంది. ఉద్యమించే క్రమంలో దొరుకుతుంది. ఉద్యమించేహక్కును లేకుండచేసి పరిష్కారం చెప్పండీ అనడం దుర్బుద్ధి పూర్వకమయిన కుట్ర.

ప్రభుత్వం అపనే చేస్తూఉంది. మెడమీద తుపాకి పెట్టి కాళ్లూచేతులూ కట్టేసి ఇచ్చినసహాయం తీసుకొమ్మంటుంది. నిరర్థకంగా తాను నియమించిన గంగాధరరావు కమిషన్‌తో సహకరించమంటుంది. ఎస్.ఐ., సి.ఐ.ల అరెస్టుకోరడం మానేయమంటుంది. అనిల్‌కుమార్ హత్యను మరచి పొమ్మంటుంది. ఉద్యమం మానేసి ఇంటికి పొమ్మంటుంది. ఇది ప్రజాస్వామ్యం కాదని మేము అంటున్నాం. ఇది ఫాసిజం అంటున్నాం.

అందుకే ప్రజలారా మీకే విజ్ఞప్తి చేస్తున్నాం. ఉద్యమించే హక్కును కాపాడుకోండి, అది లేకుంటే భవిష్యత్తులేదు. ప్రజాస్వామ్య విలువలనూ హక్కులనూ కాపాడుకోండి, అవిలేనిదే పురోగతి లేదు. ప్రభుత్వం అనేదిఉన్నంతకాలం అది ప్రజాస్వామికంగా ఉండాలే తప్ప ఇష్టారాజ్యంగా ఉండడానికి వీలు లేదని మెడలు వంచి రాజ్యాంగ బద్ధంగా చట్టబద్ధంగా పాలన సాగేలాగ చూడండి. లేకపోతే మనుగడే లేదు.

19 అక్టోబర్ 1991

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
(APCLC)